# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :146 EDITOR:CHERUKU UPENDAR, DATE : WEDNESDAY 11 OCTOBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 146 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : బుధవారం 11 అక్టోబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


### కేసీఆర్ నామినేషన్ వేసేందుకు

## ముహూర్తం ఖరారు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ సీఎం కేసీఆర్ నామినేషన్ వేసేందుకు ముహూర్తం ఖరారు అయింది. వచ్చే ఎన్నికల్లో తన సొంత నియోజకవర్గమైన గజ్వేల్ సెగ్మెంట్‌తో పాటు కామారెడ్డి నుంచి పోటీ చేయాలని కేసీఆర్ నిర్ణయించుకున్నారు. ఆ రెండు

మిగతా 2లో...

### బీజేపీ అభ్యర్థుల లిస్ట్‌పై

## అమిత్‌షా కసరత్తు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

బీజేపీ అభ్యర్థుల లిస్ట్‌పై అమిత్ షా కసరత్తు చేస్తున్నారు. మంగళవారం నాడు హైదరాబాద్‌లోని ఐటీసీ కాకతీయ హోటల్లో అమిత్ షా ఆధ్వర్యంలో మేధావుల సదస్సు నిర్వహించారు. ఈ భేటీకి కిషన్‌రెడ్డి, ఎంపీలు లక్ష్మణ్, ధర్మపురి అర్వింద్, జవదేకర్, డీకే అరుణ, ఇంద్ర సేనారెడ్డిలతో పాటు ఇతర నేతలు హాజరయ్యారు. ఉదయం ఆదిలాబాద్ జిల్లాలో అమిత్ షా పర్యటించారు. ఇప్పటికే ఫైనల్ అయిన 40మంది అభ్యర్థులు. మరికొన్ని పేర్లను అసెంబ్లీ అభ్యర్థుల లిస్ట్‌లో జతచేయనున్నారు. ఇప్పటికే బీజేపీ అగ్రనేతలు రాష్ట్రంలో ప్రచారం దూకుడు పెంచారు. ఈ సమావేశంలో బీజేపీ అగ్ర నేతలు కేసీఆర్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌తో కలిసే ప్రసక్తే లేదని బీజేపీ అగ్ర నేతలు పదేపదే చెబుతున్నారు.

# ఎన్నికల సమరం..!




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. అధికారికంగా ఎన్నికల ప్రక్రియ మొదలైంది. మొన్నటి వరకు ఓ లెక్క ఉంటే... ఇక నుంచి మరోలెక్క అన్నట్లు ప్రధాన పార్టీల అడుగులు వేసేందుకు సిద్ధమవుతున్నాయి. వ్యూహాలకు ప్రతివ్యూహాలు.. కౌంటర్లకు రీకౌంటర్లు... విమర్శలకు ప్రతివిమర్శలు... అటు నుంచి సౌండ్... ఇటు నుంచి రీసౌండ్... సెటైర్లు.. సీరియస్ కామెంట్స్? అబ్బో ఇలా ఒకటి కాదు...ఎన్నెన్నో సిత్రాలు ఇక చూడాల్సిందే..! రాజకీయ పార్టీలు వేసే ప్రతి అడుగు పక్కాగానే కాదు ప్లాన్ తోనూ ఉంటుంది..! ఎన్నికల నగారా మోగటంతో... సింగిల్ గా వచ్చేవారు ఎవరు ..? దోస్తీ కట్టి బస్తీమే సవాల్ అనేది ఎవరు..? పొత్తు పొడుపులు ఉంటాయా..? వార్ వన్ సైడ్ అవుతుందా..? లేక టగ్ ఆఫ్ వార్ ఉంటుందా..?వంటి ముచ్చట్లు తెలంగాణ పాలిటిక్స్ ను రసవత్తరంగా మార్చటం ఖాయమనే అనిపిస్తోంది.రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు నవంబర్ 30వ తేదీన ఎన్నికలు జరగబోతున్నాయి. రాష్ట్ర ఏర్పాటు తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో(2014, 2018)... బీఆర్ఎస్(టీఆర్ఎస్) విక్టరీ కొట్టి కుర్చీపై పాగా వేసింది. అయితే గత ఎన్నికల నాటి పరిస్థితులతో పోల్చితే... ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు కంప్లీట్ గా వేరుగా ఉన్నాయి. ఆ ఎన్నికల్లో రెండు ప్రధాన పార్టీల మధ్యే పోరు అన్నట్లు సాగిపోయింది...! కానీ ఈసారి జరిగే ఎన్నికల్లో మాత్రం అలాంటి పరిస్థితి కనిపించటం లేదు. బీజేపీతో పాటు కొత్త పార్టీలు కూడా కొన్ని నియోజకవర్గాల్లో ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం కనిపిస్తోంది. ఆయా పార్టీల అధినేతలు కూడా పబ్లిక్ లో తెగ తిరిగేస్తున్నారు. ఫలితంగా ఈసారి ఫలితాలు ఎలా ఉండబోతాయనేది అందరిలోనూ ఉత్కంఠను రేపుతోంది.ఈ ఎన్నికల కోసం బీఆర్ఎస్ 114 మంది అభ్యర్థులను ప్రకటించింది. త్వరలోనే రెండో జాబితాను విడుదల చేయబోతుంది. ఇప్పటికే

మిగతా 2లో...

## మళ్లీ ఏర్పడేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

**నిజామాబాద్ - ప్రభాత సూర్యుడు :** డిసెంబర్3 తర్వాత మళ్లీ ఏర్పడేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. మంగళవారం నాడు నిజామాబాద్‌లో పర్యటించారు. కంటేశ్వర్‌లో గౌడ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. గీత కార్మిక కుటుంబాలు కవితకు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అంటే బీసీల ప్రభుత్వం. కన్న తల్లి వంటి కుల వృత్తులకు కేసీఆర్ పాలనలో పూర్వ వైభవం వచ్చింది. గత ప్రభుత్వాలు గౌడ కులస్తులను, కల్లు వ్యాపారాన్ని చిన్నచూపు

మిగతా 2లో



### తెలంగాణ అభివృద్ధికి

## మోదీ సర్కార్ కట్టుబడి ఉంది

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** తెలంగాణ అభివృద్ధికి మోదీ సర్కార్ కట్టుబడి ఉందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం నాడు హైదరాబాద్‌లోని ఐటీసీ కాకతీయ హోటల్లో అమిత్ షా ఆధ్వర్యంలో మేధావుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో 9 లక్షల కోట్ల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు కేంద్రం ఇచ్చింది. 3 వందే భారత్ ట్రైన్లు హైదరాబాద్ నుంచి వెళ్తున్నాయి.

మిగతా 2లో



### కెసిఆర్ మొదటి సభ

## విజయవంతం చేయాలి

### మంత్రి హరీష్ రావు



హుస్నాబాద్- ప్రభాత సూర్యుడు

ముఖ్యమంత్రి కేసీఆర్ మొదటి సభ పెట్టడం అంటే హుస్నాబాద్ ప్రజల మీద ఉన్న ప్రేమ, నమ్మకమని మంత్రి హరీష్ రావు అన్నారు. గత ఎన్నికల్లో మొదటి సభ నిర్వహించారు. అదేవిధంగా ఈసారి కూడా హుస్నాబాద్ నుంచి ప్రారంభించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. హుస్నాబాద్ నియోజకవర్గం అంటే లక్ష్మి కటాక్ష నియోజకవర్గం. మంచి జరుగుతుంది అని ఇక్కడ నిర్వహిస్తున్నారు. హుస్నాబాద్ పట్టణంలో సబ్‌స్టేషన్ వెనకాల ఉన్న ప్రదేశంలో సభ నిర్ణయించారు. ఎన్నికల సమయంలో ఫేక్ సర్వేలు గూగుల్ ప్రచారాలు కాంగ్రెస్ పార్టీకి అలవాటు. కనీసం టికెట్లు ఇచ్చుకొనే పరిస్థితిలో లేదు కాంగ్రెస్ పార్టీ. కాంగ్రెస్ పరిస్థితి ఢిల్లీలో ఎక్కువ గల్లీలో తక్కువ వయా బెంగళూరు. మాటలు, డబ్బు మూటలు, కర్ఫ్యూలకు, మతకల్లోలాకు పెట్టింది పేరైన కాంగ్రెస్ మంటల ముఠాలతో ఎన్నికలు చేయాలనుకుంటున్నారు. అనేక సంక్షేమ అభివృద్ధి

మిగతా 2లో

# యువ ఓటర్లే కీలకం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతోంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఇప్పుడు జరిగేవి మూడో దఫా అసెంబ్లీ ఎన్నికలు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో యువత ఎక్కువగా ప్రభావం చూపనున్నారు. తాజా ఓటరు జాబితా ప్రకారం ఏడు లక్షల మంది తొలిసారి ఓటు నమోదు చేసుకోగా... 35ఏళ్లలోపు ఓటర్లు 30శాతం కంటే ఎక్కువ మంది ఉన్నారు. దీంతో అన్ని పార్టీలు, అభ్యర్థులు యువతపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. యువతను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. తెలంగాణలోని 3.14 కోట్ల మంది ఓటర్లలో దాదాపు ఏడు లక్షల మంది 18 నుంచి 19 ఏళ్ల మధ్య వారే. అలాగే, 75 లక్షల మంది ఓటర్లు 19 నుంచి 35 ఏళ్ల మధ్య వారే ఉన్నారు2014, 2018లో బీఆర్ఎస్ ఘనవిజయం సాధించింది. ఈసారి జరగబోయే ఎన్నికల్లోనూ గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని సీఎం కేసీఆర్ గట్టి పట్టుదలతో ఉన్నారు. ఇక కర్ణాటక విజయం సాధించిన కాంగ్రెస్.. తెలంగాణలోనూ అదే ఫార్ములాతో గెలవాలని ఉవ్విళ్లూరుతోంది. ఇక... కమలం పార్టీ బీజేపీ కూడా తెలంగాణలో పాగా వేసేందుకు విశ్వప్రయత్నం చేస్తోంది. ఈ మూడు ప్రధాన పార్టీలు హోరాహోరీగా తలపడుతున్నాయి. 2014లో దేశంలోని 29వ రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఇప్పటి బీఆర్ఎస్, అప్పటి టీఆర్ఎస్... 119 స్థానలకుగాను 63 సీట్లు గెలుచుకుంది. సీఎం కేసీఆర్ తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత 2019లో ఎన్నికలు జరగాల్సి ఉండగా... 2018లో ముందస్తు ఎన్నికలకు వెళ్లారు సీఎం కేసీఆర్. అప్పుడు కూడా 119 స్థానలకుగాను 87 సీట్లు గెలుచుకుని మళ్లీ అధికారం చేజిక్కించుకున్నారు. 2018లో కాంగ్రెస్, టీడీపీ, తెలంగాణ జనసమితి, సీపీఐలు కలిసి ప్రజాకూటమిగా ఏర్పడినప్పటికీ 22 స్థానాలు మాత్రమే దక్కిం చుకున్నాయి. ఇక, ఎంఐఎం ఏడు, ఇండిపెండెంట్లు రెండు, బీజేపీ ఒక సీటు మాత్రమే గెలుచుకుంది. 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ 46.87శాతం ఓట్లును సాధించింది. ఇక... కాంగ్రెస్‌కు 19 సీట్లు వచ్చినా 28.43శాతం ఓట్లు మాత్రమే సాధించగలిగింది. బీజేపీకి 6.98 శాతం ఓట్లతో సరిపెట్టుకుంది. 2018 తర్వాత జరిగిన ఉపఎన్నికలు, లోక్సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ పుంజుకుంది. దుబ్బాక, హుజూరాబాద్‌లో బీజేపీ సభ్యులు గెలిచారు. మునుగోడులో బీఆర్ఎస్ గెలిచినా... బీజేపీ గట్టి పోటీ ఇచ్చింది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలో గెలుపెవరిది అన్నది.. ఈసారి స్పష్టంగా అంచనా వేయలేకపోతున్నారు విశ్లేషకులు. బీఆర్ఎస్ హ్యాట్రిక్‌పై ఆశలు పెట్టుకున్నా... ఈసారి స్పష్టమైన మ్యాజిక్ ఫిగర్ రాకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెండో స్థానంలో ఉన్న కాంగ్రెస్ కూడా... కేసీఆర్ మ్యాజిక్ ముందు నిలబడలేదన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఇక ప్రస్తుతం మూడో స్థానంలో ఉన్న బీజేపీ గ్రాఫ్ పెరగడం కూడా అంత సులువు కాదన్న చర్చ జరుగుతోంది. మరి... ఈసారి అధికారం చేపట్టబోయే పార్టీ ఏది అన్నది ఉత్కంఠగా మారింది.ప్రతిపక్ష పార్టీలు



మిగతా 2లో...

## తెలంగాణ అభివృద్ధికి మోదీ సర్కార్ కట్టుబడి ఉంది

(మొదటి పేజీ తరువాయి)

రింగురోడ్డు తెలంగాణ అభివృద్ధికి గేమ్ ఛేంజర్ అవుతుంది. నరేంద్ర మోదీ ఎజెండా వికాస్. నరేంద్ర మోదీని మరోసారి ఆశీర్వదించండి. తెలంగాణలో మంచి సర్కార్‌ను అందిస్తాం. కేంద్ర ప్రభుత్వం సహకారం లేకపోతే వచ్చే ప్రభుత్వం నడవలేదు. డబ్బుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్ టెండర్ వేసింది. ముందుగానే మద్యం టెండర్లు వేసింది. విలువైన భూములు అమ్ముకుంటుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## మళ్లీ ఏర్పడేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

(మొదటి పేజీ తరువాయి)

చూశాయి. అలాంటి కులవృత్తులను పునరుద్ధరించేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారు. ప్రభుత్వం పాలసీగా తీసుకొని ఈత వనాలని పెంచుతోంది. మద్యం టెండర్లలో 15 శాతం గౌడ కులస్తులకు రిజర్వేషన్ కల్పిస్తున్నాం. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నాం. నిజామాబాద్ జిల్లాకు ఒకటే బీసీ హాస్టల్ ఉండే... అలాంటిది ఈరోజు 15 బీసీ హాస్టళ్లను ఏర్పాటు చేసుకున్నాం. ఎన్నికలపుడు అనేక పార్టీలు వస్తాయి.. వారిని నిలదీయాలని కవిత పేర్కొన్నారు.

## యువ ఓటర్లే కీలకం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్, బీజేపీ కంటే సీఎం కేసీఆర్ ఎన్నికల క్షేత్రంలో ముందే ఉన్నారు. పార్టీ అభ్యర్థులను ముందుగానే ఖరారు చేసేశారు. 119 స్థానాలకు గాను 115 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించారు. టికెట్లు రాని అసంతృప్తుల్లో కొందరు పార్టీలు మారిపోగా... మరికొందరిని అధిష్టానం బుజ్జగించింది. దీంతో పార్టీ టికెట్ల లొల్లి దాదాపుగా ఒక కొలిక్కివచ్చింది. మరోవైపు... ప్రచారంలోనూ బీఆర్ఎస్ ముందే ఉంది. సీఎం కేసీఆర్ స్వల్ప అస్వస్థతతో ప్రజలకు కాస్త దూరంగా ఉన్నా...మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు ప్రచారంలో దుమ్ము రేపుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చూస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలు అయిన కాంగ్రెస్, బీజేపీ.. ఇంకా అభ్యర్థుల కసరత్తులోనే ఉన్నాయి. మరోవైపు కాంగ్రెస్ ఇప్పటికే గ్యారెంటీ స్కీమ్‌లు ప్రకటించింది. ఆ గ్యారెంటీ స్కీములపైనే ఆశలు పెట్టుకుంది. అయితే సీఎం కేసీఆర్.. దీనికి కూడా కౌంటర్ ఇవ్వబోతున్నారు. కాంగ్రెస్ గ్యారెంటీ స్కీములను మించిన పథకాలతో మేనిఫెస్టో తీసుకురాబోతున్నారు. ఈనెల 16న వరంగల్‌లో బహిరంగ సభ నిర్వహించి మేనిఫెస్టో విడుదల చేయబోతున్నట్టు కూడా తెలుస్తోంది. పాజిటివ్ ఓట్ బ్యాంక్‌నే నమ్ముకున్నారు సీఎం కేసీఆర్.

## నా గురువు కేసీఆర్‌ను మంత్రి కేటీఆర్ ఏం చేసిండో..?



**ఆదిలాబాద్-ప్రభాత సూర్యుడు:** సీఎం కేసీఆర్‌ను ఆయన ఫ్యామిలీ నుంచి రక్షణ కలిపించాలని కరీంనగర్ బీజేపీ ఎంపీ బండి సంజయ్ అన్నారు. మంగళవారం నాడు ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించిన జనగర్జన సభలో ఆయన మాట్లాడుతూ.. మన ముఖ్యమంత్రిని ఆయన కొడుకు కేటీఆర్ ఏమైనా చేసిండోనని అనుమానం ఉంది. కేసీఆర్ నాకు గురువు ఆయన నుంచే మాటలు నేర్చుకున్నా, ఆయన ఏమైండు...ఆయన బాగుండాలి. కర్ణాటకలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ అట్టర్ ఫ్లాప్ అయింది. అమలు సాధ్యం కానీ హామీలతో అతి గతీ లేకుండా పోతోంది. 5లక్షల కోట్ల అప్పు తెచ్చి కేసీఆర్ ఏమీ చేశారని బండి సంజయ్ ప్రశ్నించారు. కాగా.. ఆదిలాబాద్ సభలో బండి సంజయ్ సీఎం సీఎం అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు.

## శ్రీవారిని దర్శించుకున్న సీఎం కేసీఆర్ భార్య శోభ

**తిరుమల- ప్రభాత సూర్యుడు :** తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సతిమణీ శోభ మంగళవారం తిరుమలలో శ్రీవారి దర్శనం చేసుకున్నారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. తన భర్త ఆరోగ్యం కోసం స్వామిని మొక్కుకుని, తలనీలాలను సమర్పించారు. సోమవారం ఆమె తిరుమలకు చేరుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున సుప్రభాత సేవలో పాల్గొన్నారు. అనంతరం శ్రీవారి అర్చన సేవలో పాల్గొనిస్వామివారి ఆశీస్సులను తీసుకున్నారు. శోభకు అర్చకులు, టీటీడీ అధికారులు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆమెను అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందించారు. వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పక్కనే ఉండి ఆమె కు స్వామివారి దర్శనం చేయించారు.

## పోలీసుల తనిఖీలలో పట్టుబడ్డ 9.5 లక్షల నగదు

**వికారాబాద్- ప్రభాత సూర్యుడు :** తెలంగాణ రాష్ట్రంలో ఎలక్షన్ కోడ్ అమల్లోకి రావడంతో పోలీసుల వాహనాల తనిఖీలలో భాగంగా వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో హైదరాబాద్ నుండి తాండూర్ వెళు తున్న కారులో తనిఖీలు చేయగా 9.5 లక్షలనగదు పట్టుబడింది. ఇట్టి నగదును పోలీసులు స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున 50 వేలకు మించి నగదు పట్టుబడితే నగదుకు సంబంధించిన పూర్తివివరాలను తెలియజేయాలని వికారాబాద్ సిఐ టంగుటూరి శ్రీను తెలిపారు.

# ఎన్నికల సమరం..!

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థులు ప్రచారం షురూ చేశారు. పార్టీలోని కీలక నేతలైన కేటీఆర్, హరీశ్ రావు వరుసగా జిల్లాల పర్యటనకు వెళ్తున్నారు. పార్టీ తలపెట్టిన బహిరంగ సభల్లో ప్రసంగిస్తూ... ప్రతిపక్ష పార్టీలపై విమర్శలు దాడిని మొదలుపెట్టారు. మరోసారి బీఆర్ఎస్ పట్టం కట్టాలని చెబుతున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ పార్టీలను టార్గెట్ చేస్తున్నారు. త్వరలోనే పార్టీ అధినేత కేసీఆర్ కూడా రంగంలోకి దిగబోతున్నారు. అక్టోబరు 16వ తేదీన మేనిఫెస్టో ప్రకటించనుంది బీఆర్ఎస్. మరోవైపు ఈసారి ఎన్నికలను కాంగ్రెస్ అత్యంత సీరియస్ గా తీసుకుంది. ఇప్పటికే కీలకమైన హామీలను ప్రకటించిన జనాల్లోకి వెళ్తోంది. త్వరలోనే అభ్యర్థుల జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటికే పలు పార్టీలకు చెందిన నేతలకు కండువాలను కప్పింది. త్వరలోనే పార్టీలోని సీనియర్లు నేతలు... బస్సు యాత్రకు ప్లాన్ చేస్తున్నారు. కలిసిగట్టుగా పని చేసి... తెలంగాణ గడ్డపై హస్తం జెండాను ఎగరవేయాలి గట్టిగా భావిస్తున్నారు. పార్టీ హైకమాండ్ కూడా తెలంగాణపై గురి పెట్టింది. కీలకమైన సీడబ్ల్యూసీ భేటీ తో పాటు విజయభేరి సభతో తెలంగాణ ప్రజలకు స్పష్టమైన సందేశాన్ని ఇచ్చే ప్రయత్నం కూడా చేసింది. తెలంగాణలో తామే ప్రత్యామ్నాయం అని చెబుతూ వచ్చిన బీజేపీ.... ఎన్నికల ఏడాదిలోకి వచ్చిన తర్వాత దూకుడు తగ్గిందనే వాదన ఉంది. ప్రధానంగా పార్టీ అధ్యక్షుడి మార్పుతో పాటు పలు పరిణామాలు ఆ పార్టీని ఇరకాటంలోకి నెట్టిసినట్లు అయిందనే వాదన గట్టిగా వినిపిస్తోంది. ఇదిలా ఉన్నప్పటికీ... వచ్చే ఎన్నికల కోసం గట్టిగా కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ప్రధాని మోదీ, అమిత్ షా, నడ్డా వంటి జాతీయ నేతలు తెలంగాణలో పర్యటించారు. ఇటీవలే పసుపు బోర్డు, ట్రైబల్ వర్సిటీతో పాటు కృష్ణా ట్రిబ్యునల్ ప్రకటించి... తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందనే విషయాన్ని బలంగా చెప్పే ప్రయత్నం చేస్తోంది. త్వరలోనే అభ్యర్థుల జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. వీరు ఈ మేరకు ప్రభావితం చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగానే పోటీ చేస్తామని స్పష్టం చేసింది. అయితే కాంగ్రెస్ పార్టీ - కమ్యూనిస్టుల మధ్య పొత్తు ఉండేలా కనిపిస్తోంది. ఆ దిశగా చర్చలు జరుగుతున్నాయి. ఇక బీజేపీ కూడా ఒంటరిగానే బరిలో ఉండనుంది. బీఎస్పీ, జనసేనతో పాటు తెలుగుదేశం పార్టీలు కూడా సింగిల్ గానే బరిలో ఉండేలా కనిపిస్తోంది. మరోవైపు వైఎస్ షర్మిల ఒంటరిగా బరిలో ఉంటారా.. ?కాంగ్రెస్ తో కలుస్తారా...? అన్నది తేలాల్సి ఉంది. మొత్తంగా చూస్తే.... ముచ్చటగా మూడోసారి గెలిచి... హ్యాట్రిక్ కొట్టాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చూస్తుంటే... ఎలాగైనా ఈసారి పవర్ లోకి రావాలని కాంగ్రెస్ కసితో ఉంది. రెండు పార్టీలకు కాకుండా... తమకు ఒక్క ఛాన్స్ ఇవ్వాలని బీజేపీ అడుగుతోంది. ప్రజలను ఆలోచనలో పడేసే ప్రయత్నం చేస్తోంది. వైఎస్ఆర్టీపీ, బీఎస్పీ, జనసేన, టీడీపీ, తెలంగాణ జనసమితి పార్టీలు ఈసారి ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయనేది కూడా కాస్త ఆసక్తికరంగానే ఉంటుంది. అయితే ఈ ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ గెలిస్తే... తెలంగాణలో మరోసారి తిరుగులేని రాజకీయ శక్తిగా మారుతుంది. అంతేకాదు దేశ రాజకీయాల్లోనూ కీలక పాత్ర అవకాశం ఉంటుంది. అది ఏ రూపంలో ఉంటుందనేది అప్పటి పరిస్థితులను బట్టి అంచనా వేయవచ్చు. ఇక కాంగ్రెస్ గెలిస్తే తెలంగాణ గడ్డపై హస్తం పార్టీకి తిరుగుండదు...! కానీ మరోసారి బోల్తా పడితే మాత్రం.. కథ కంచికే అన్నట్లు ఉంటుంది. తెలంగాణలో తామే అల్టర్నేట్ అంటున్న కమలనాథులు... అసెంబ్లీ ఫైట్ లో గట్టి పరీక్షనే ఎదుర్కొవాల్సి ఉంటుంది. వీటన్నింటికి సమాధానం దొరకాలంటే... ఆగాల్సింది ఫలితాలు వచ్చే వరకే...!

# కేసీఆర్ నామినేషన్ వేసేందుకు ముహూర్తం ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీలోకి దిగేందుకు కేసీఆర్ నామినేషన్ వేసేందుకు మంచి ముహూర్తం ఖరారు చేసుకున్నారు. నవంబర్ 9న ఆ రెండు నియోజకవర్గాల నుంచి కేసీఆర్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. తాను సెంటిమెంట్ ఆలయంగా నమ్మే కోనాయపల్లి వెంకటేశ్వరస్వారి ఆలయంలో పూజల అనంతరం కేసీఆర్ నామినేషన్ వేయనున్నారు. ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఈ నెల 15 నుంచి కేసీఆర్ జిల్లాల పర్యటనలు చేయనున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహించనున్నారు. 15న హుస్నాబాద్, 16న జనగామ, భువనగిరిలో సభలు నిర్వహించనున్నారు. ఇక 17న సిద్దిపేట, సిరిసిల్ల.. 18న జడ్చర్ల, మేడ్చల్‌లో సభలు నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 15న తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కేసీఆర్ భేటీ కానున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు బీఫారాలు అందించడంతో పాటు ఎన్నికల వ్యూహంపై దిశానిర్దేశం చేయనున్నారు. 15వ తేదీనే కేసీఆర్ బీఆర్ఎస్ మేనిఫెస్టో విడుదల చేయనున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల హామీలకు పోటీగా ప్రజలను ఆకట్టుకునేలా బీఆర్ఎస్ పలు కీలక హామీలు ఇవ్వనుందని తెలుస్తోంది. ఇప్పటికే బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై కసరత్తు జరుగుతోంది. మహిళా ఓటర్లను ఆకట్టుకునేలా అద్భుతమైన పథకాలు ఉంటాయని ఇటీవల బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై మంత్రి హరీష్ రావు హింట్ ఇచ్చారు.

మహిళలకు త్వరలోనే గుడ్ న్యూస్ అందుతుందని స్పష్టం చేశారు. ఆయన వ్యాఖ్యలను బట్టి చూస్తే బీఆర్ఎస్ మేనిఫెస్టోలో కీలక హామీలు ఉంటాయని స్పష్టమవుతుంది. మరోవైపు ఇప్పటినుంచే బీఆర్ఎస్ ప్రచారాన్ని మరింత ముమ్మరం చేసింది. కేసీఆర్ వైరల్ ఫీవర్ వల్ల ప్రగతిభవన్‌కే పరిమితమవ్వగా.. మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. హరీష్, కేటీఆర్ వరుస సభలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. గత 9 ఏళ్లల్లో కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరిస్తున్నారు. మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై విమర్శలు చేస్తున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఏమీ చేయలేదని బీజేపీపై కూడా ఆరోపణలు చేస్తున్నారు. సభలలో వారిద్దరు చేసే కామెంట్స్ ఎన్నికల వేడిని మరింత పెంచుతున్నాయి. ఇప్పుడు ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో రేపటి నుంచి పార్టీల మధ్య మాటల వార్ మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి. అటు కాంగ్రెస్ కూడా ఈ నెల 15వ తేదీ నుంచి బస్సు యాత్రకు రెడీ అవుతుంది. 10వ తేదీన గాంధీ భవన్‌లో పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం జరగనుంది. ఈ భేటీలో బస్సు యాత్ర రూట్ మ్యాప్‌ను ఖరారు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర జరగనుండగా.. మూడు రోజుల పాటు ఇందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ పాల్గొననున్నారు. ఇక బీజేపీ కూడా 15వ తేదీ నుంచి బహిరంగ సభలకు సిద్దమవుతోంది.

# కెసిఆర్ మొదటి సభ విజయవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమాలు హుస్నాబాద్ లో జరిగాయి. 8 టిఎంసిలతో గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసుకున్నం. నీళ్లు వస్తే ప్రతి ఒక్కరు సంతోషం. ప్రతిపక్షాలు మాత్రం కన్నీళ్లు పెట్టుకుంటై. హుస్నాబాద్ ఎమ్మెల్యేగా సతీష్ బాబు ఉండటం మీ అందరి అదృష్టం. 15వ తేదీ మేనిఫెస్టో విడుదల తర్వాత నిర్వహించే మొదటి సభ హుస్నాబాద్ లో జరుగుతుంది. కెసిఆర్ మేనిఫెస్టో ప్రకటించిన తర్వాత రాష్ట్రంలో ప్రతిపక్షాల మైండ్ బ్లాక్ అవడం ఖాయమని అన్నారు.

2014, 18లలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్. ఏవయితే చెప్తారో దానిని పక్క చేసి చూపిస్తారు ముఖ్యమంత్రి కేసీఆర్. పొత్తు పెటొట్టన పెట్టుకుందామని చూసింది కాంగ్రెస్ పార్టీ. 2004లో కాంగ్రెస్ పార్టీ పొత్తులో ఉన్న టిఆర్ఎస్ పార్టీని మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ. కామన్ మినిమం ప్రోగ్రాంలో ప్రత్యేక రాష్ట్ర అంశాన్ని పెట్టి ఎంతో మంది తెలంగాణ ప్రజల చావుకి కారణం అయింది కాంగ్రెస్ పార్టీ. మూడు గంటలు కరెంటు రైతులకు సరిపోతుంది అన్న కాంగ్రెస్ కావాలా రైతుల మోటర్లకు మీటర్లు పెడుతున్న బిజెపి కావాల్నా, మూడు పంటలకు సరిపడా కరెంటు ఇస్తున్న కేసీఆర్ కావాలా అని ప్రశ్నించారు. హుస్నాబాద్ నియోజకవర్గం ఎందుకు బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి చెందింది.. కాంగ్రెస్ నాయకులు ఎందుకు అభివృద్ధి చేయలేదు. ముఠా రాజకీయాలతో ఢిల్లీలో టికెట్ ల పంచాయితీ నడుస్తుంది. బీఆర్ఎస్ టికెట్ ప్రకటించి 50 రోజులైనా ఇప్పటికీ టికెట్లు ప్రకటించుకోని కాంగ్రెస్ పార్టీ. ముఖ్యమంత్రి కేసీఆర్ రి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రము దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఒకటి కాదు అనేక పథకాలకు దేశానికి ఆదర్శంగా నిలిచింది. కేంద్రమే మన పథకాలు కాపీ కొట్టింది అంటే మనం ఆదర్శమా కాదా. మూడో సారి కెసిఆర్ విజయం పక్కా. ముఖ్యమంత్రి కెసిఆర్ మొదటి సభ విజయవంతం చేయాలి. మన మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి. పండుగ వాతావరణంలో ఈ సభను విజయవంతం చేసి కెసిఆర్ గారిని ఘనంగా స్వాగతం పలకాలని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన ప్రతి ఒక్కరు ఈ సభకు వస్తారు అందరినీ ఆహ్వానించాలి. ప్రణాళికతో జాగర్తగా ప్రజలకు ఇబ్బంది లేకుండా సభాస్థలానికి చేరుకునే విధంగా స్థానిక నాయకులు చూడాలి.

## మీడియాలో వస్తున్న

# అభ్యర్థుల పేర్లు నిజం కావు



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** కొన్ని మీడియా సంస్థలు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థుల లిస్ట్‌లో కొంతమంది నేతల పేర్లను చెబుతూ గందరగోళం చేస్తున్నాయని.. ఆ పేర్లు నిజం కావని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం నాడు గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తప్పుడు వార్తలు వేస్తున్న యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు పెట్టాలి. పార్టీలకు బాకా ఉదుతున్న వార్తలను పెయిడ్ వార్తలుగా పరిగణించాలి. పీఏసీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నాం. రాహుల్, ఖర్గే, ప్రియాంక కావల్సినంత సమయం ఇస్తా అన్నారు. అభ్యర్థులను ప్రకటించి బస్సు యాత్ర చేయాలా? బస్సు యాత్ర చేసి అభ్యర్థులను ప్రకటించాలా అని ఆలోచిస్తున్నాం. ఒక ప్రాసెస్ ప్రకారం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఉంటుంది. పలు రాజకీయ పార్టీలతో పొత్తులపై చర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయి. పార్టీకి సేవ చేసిన వారికి సముచిత గౌరవం ఇస్తాం. అసెంబ్లీ అభ్యర్థులను మాత్రమే ప్రకటిస్తున్నాం. కాంగ్రెస్ పార్టీలో ఇంకా అనేక పదవులు, అవకాశాలు ఉంటాయి. జానారెడ్డి, థాక్రే, మున్షీ, మీనాక్షి నటరాజన్ అధ్వర్యంలో ఒక కమిటీ వేస్తున్నాం. పార్టీ కోసం పనిచేసిన వారి విషయంలో నిర్ణయాలు, సూచనలు ఇవ్వడానికి ఈ కమిటీ పని చేస్తుంది. రాష్ట్రంలో కొందరు అధికారులు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కంటే ఎక్కువగా ఆ పార్టీ కోసం పని చేస్తున్నారు.


రాష్ట్ర డీజీపీ ఏపీ క్యాడర్ ఆఫీసర్. స్టీఫెన్ రవీంద్ర, ప్రభాకర్‌రావు లాంటి అధికారులు ఒకే పదవిలో పలు సంవత్స రాలుగా ఉన్నారు. కొందరు సీఐలు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. అధికారులు ఆర్థిక నియంత్రణ పాటించాలి. బీఆర్ఎస్ పార్టీకి ప్రయో జనం చేకూరే విధంగా పనిచేస్తున్న అధికారులను వదిలిపెట్టం. ఎంపీలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులకు సంబంధించిన పలు కీలక అంశాలను పీఏసీలో చర్చించారు. ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తున్న అధికారుల నియంత్రణ కోసం ఒక కమిటీ నియమించాం. కేసీఆర్ దొరికినోనికల్లా పదవి ఇస్తున్నాడు. అవి చెల్లవు. గత ఆరు నెలల నుంచి కేసీఆర్ బీఆర్ఎస్ నేతలకు ఇచ్చిన పదవులను రద్దు చేయాలి. కేసీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాడు. గత ఆరు నెలల నుంచి జరిగిన టెండర్లు, నిర్ణయాలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సమీక్షిస్తుంది. ఎన్నికల హోర్డింగులు తదితర చోట్ల ప్రతిపక్షాలకు స్థానం లేకుండా చేస్తున్నారు. మెట్రో హోర్డింగుల్లో కూడా అన్ని పార్టీలకు సమ ప్రాధాన్యత ఇవ్వాలి. డిసెంబర్ 3వ తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుంది" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## సంపాదకీయం

# 2024 ఎన్నికలకు లిట్మస్ టెస్ట్

తెలంగాణ, చత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మిజోరంలో త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ను ప్రకటించింది. గత ఎన్నికల్లో ఏ పార్టీ ఎన్ని సీట్లు వచ్చాయి. ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో ఏ పార్టీ గెలుస్తుందన్న అంశం ఉత్కంఠ రేపుతోంది. దేశంలోనే వైశాల్యంలో అతిపెద్ద రాష్ట్రంగా గుర్తింపు పొందిన రాజస్థాన్‌లో 200 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వరుసగా రెండోసారి అధికారంలోకి రావాలని ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. 2003 తర్వాత ఏ ప్రభుత్వాన్నీ వరుసగా గెలిపించని రాజస్థానీలు, ఈ సారి ఎవరికి పట్టం కడతారో అన్నది ఆసక్తికరంగా మారింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 108 సీట్లు రావడంతో అశోక్ గెహ్లాట్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే మెజార్టీ 101 సీట్లు మాత్రమే. అయితే 108 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపొందారు. ఆ తర్వాత 13 మంది స్వతంత్రులతో పాటు ఆర్ఎల్డీ ఎమ్మెల్యే కాంగ్రెస్ కు మద్దతు ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ బలం 122కి పెరిగింది. బీజేపీకి 70, భారతీయ ట్రైబల్ పార్టీ 2, కమ్యూనిస్టు పార్టీకి రెండు సీట్లు చొప్పున వచ్చాయి. 90 నియోజకవర్గాలున్న చత్తీస్ గఢ్ లో, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. చత్తీస్ గఢ్ అంటేనే ఎస్టీ జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రం. ఇక్కడ ఎస్టీల్లో మెజారిటి వర్గాలు హస్తం పార్టీకే మద్దతుగా నిలుస్తున్నారు. బస్తర్ జిల్లాలోని 12 సీట్లూ, ఇపుడు కాంగ్రెస్ చేతిలోనే ఉన్నాయి. రాబోయే ఎన్నికల్లో కొన్ని సీట్లు తగ్గినా మెజారిటి మాత్రం కాంగ్రెస్ పార్టీ నేతలు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 68 సీట్లు వస్తే, బీజేపీ 15 సీట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. మెజార్టీ 46 సీట్లు రావాల్సి ఉంటే హస్తం పార్టీకి ఏకంగా 68 వచ్చాయి. అధికార పార్టీలో చిన్న ఆధిపత్య గొడవలే తప్ప చెప్పుకోదగ్గ అవినీతి ఆరోపణలు లేకపోవటమే కాంగ్రెస్ పార్టీకి ప్లస్సవుతోంది. సుక్మా, రాయపూర్, జగదల్ పూర్, బిలాస్ పూర్, అంబికాపూర్, కోబ్రా, రాయగఢ్ ప్రాంతాల్లో మెజార్టీ వస్తుందన్న ధీమాలో కాంగ్రెస్ ఉంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఈ జిల్లాల్లో ఎక్కువ సీట్లు సాధించింది. రాష్ట్రంలో కుర్మీలు రెండో అతిపెద్ద సామాజికవర్గంగా ఉన్నారు. భూపేష్ భగేల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2018లో మధ్యప్రదేశ్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ సీట్లు సాధించింది. 234 సీట్లుంటే 114 నియోజకవర్గాల్లో విజయం సాధించింది. అయితే మెజార్టీకి రెండు సీట్ల దూరంలో ఆగిపోయింది. భారతీయ జనతా పార్టీకి 109 వచ్చాయి. అప్పటి వరకు అధికారంలో ఉన్న బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది. రెండు పార్టీలు దాదాపు 41% ఓట్లను సాధించాయి. కాంగ్రెస్, బీజేపీ మధ్య ఓట్ల తేడా కేవలం 47,827 మాత్రమే. ఈ రెండు పార్టీలలో ఏ ఒక్కటీ 116 సీట్లతో మెజారిటీని సాధించకపోవడంతో హంగ్ ఏర్పడింది. గత 15 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ ఓటర్లు ఆ పార్టీని ఆదరించలేకపోయారు. స్వతంత్రులతో కమల్ నాథ్ ముఖ్యమంత్రిగా బాధ్యలు చేపట్టారు. అయితే ఎక్కువ కాలం అధికారంలో కొనసాగలేకపోయారు. తర్వాత శివరాజ్ సింగ్ చౌహన్ ముఖ్యమంత్రి అయ్యారు. మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో మిజో నేషనల్ ఫ్రంట్ విజయం సాధించింది. ప్రజా వ్యతిరేకతతో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయింది. ఎంఎన్ఎఫ్‌కు 26 స్థానాలు దక్కాయి. కాంగ్రెస్ కేవలం ఐదు స్థానాల్లో మాత్రమే గెలిచింది. ఎంఎన్ఎఫ్‌కు 65 శాతం ఓట్లు దక్కాయి. మిజోరంలో మొత్తం 40 శాసనసభ స్థానాలున్నాయి. మెజారిటీ మార్క్ 21. ఎంఎన్ఎఫ్ 26 స్థానాల్లో విజయం సాధించింది. కాంగ్రెస్‌కు కేవలం 5 స్థానాలు మాత్రమే దక్కాయి. ఇతరులు 8 స్థానాల్లో గెలుపొందారు. ఇక కాంగ్రెస్, బీజేపీలు పక్కా ప్లాన్ తో అడుగులు వేస్తున్నాయి. ఎన్నికల ముందు పార్టీ రాష్ట్ర నాయకత్వాన్ని మార్చిన బీజేపీ అధిష్ఠానం.. కాస్త ఆలస్యమైనా పక్కాగా ఎన్నికల వ్యూహాన్ని అమలు చేస్తోంది. నిజామాబాద్‌కి పసుపుబోర్డు, ములుగుకి ట్రైబల్ యూనివర్సిటీ మంజూరు చేసి తెలంగాణ ప్రజలను మెప్పించే ప్రయత్నంచేసింది. స్వయంగా ప్రధాని నరేంద్రమోదీ రెండుజిల్లాల పర్యటనలకు వచ్చి ఈ ప్రకటనచేయడంతో రెట్టించిన ఉత్సాహంతో ఉన్నాయి కమలం శ్రేణులు. తెలంగాణకు కేంద్రం అన్యాయంచేస్తోందన్న బీఆర్ఎస్ వాదనని తిప్పికొట్టేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది బీజేపీ. తొమ్మిదేళ్లలో పదిలక్షలకోట్లు తెలంగాణకు ఇచ్చామన్న ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోంది. కృష్ణాజలాల వాటాను తేల్చేందుకు ట్రిబ్యునల్ నియామక ప్రకటనతో మరో అడుగు ముందుకేసింది బీజేపీ.ఎన్నికలకోసం పద్నాలుగు కమిటీలతో.. అసంతృప్తనేతలందరికీ పెద్దపీట వేసింది బీజేపీ అగ్రనాయకత్వం. అగ్రనేతల పర్యటనలతో దూకుడు పెంచబోతోంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ టార్గెట్‌గా విమర్శల డోసు పెరగబోతోంది. మోదీ మొన్నటి పర్యటనతోనే బీఆర్ఎస్‌పై ఆ పార్టీనుంచి గట్టి ఎదురుదాడి మొదలైనట్లయింది.ఐదురాష్ట్రాల ఎన్నికల్లో తెలంగాణకి ఆఖర్న ఎన్నికలు జరగబోతుండటంతో.. చివరి వారంలో సుడిగాలి పర్యటనలతో హోరెత్తించే వ్యూహంతో బీజేపీ ఉంది. అభ్యర్థులకోసం గట్టి కసరత్తు చేస్తున్న బీజేపీ.. క్యాండేట్లు లేరన్న లోటు రాకుండా సీనియర్‌నేతలంతా ఎమ్మెల్యేలుగా పోటీచేయాల్సిందనే కండిషన్ పెట్టింది. దీంతో సీనియర్లంతా ఆయా నియోజకవర్గాల్లో ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

## పెద్దపెల్లి జిల్లాలో
# దంపతుల ఆత్మహత్య



**పెద్దపల్లి- ప్రభాత సూర్యుడు :** జిల్లాలోని మంథని మండలంలో విషాద సంఘటన చోటుచేసుకుంది. మంథని మండలంలోని నెల్లిపల్లి గ్రామంలో దంపతులు మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్ మార్టం నిమిత్తం మార్చురికి తరలించారు. మృతులను అశోక్, సంగీతగా పోలీసులు గుర్తిం చారు. వీరికి ఇద్దరు పిల్లలు వున్నారు. ఆర్థిక ఇబ్బందులే దంపతుల ఆత్మహత్యకు కారణమని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు అంతర్జాతీయ బాలికల దినోత్సవం



అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబరు 11న నిర్వహిస్తారు. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, అనర్థాలను నివారించి, వారి హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించింది. అమెరికన్ పౌరహక్కుల కార్యకర్త ఎలానార్ రూజ్‌వెల్ట్, 192 దేశాలు సంతకం చేసిన మానవ హక్కుల ప్రకటనలో స్త్రీ, పురుష సమానత్వాన్ని ప్రతిబింబించేలా మ్యాన్ అన్న పదాన్ని పీపుల్‌గా మార్చింది. మహిళల ఆత్మగౌరవం కాపాడడం కోసం పోరాటం చేసిన ఎలానార్ రూజ్‌వెల్ట్ పుట్టిన రోజైన అక్టోబరు 11ను అంతర్జాతీయ బాలికా దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి గుర్తించింది. 2012, అక్టోబరు 11న తొలిసారిగా ఈ దినోత్సవం జరుపబడింది. ప్రపంచవ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు (విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస, బలవంతపు బాల్య వివాహం)పై, వివక్షతపై అవగాహన పెంచడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం.బాలికలు, యువతులు వారివారి రంగాలలో ప్రచారం, పరిశోధనలకు సంబంధించి సాధించిన అభివృద్ధిని ప్రతిబింబించేలా ఈ దినోత్సవ వేడుకలు జరుగుతాయి. ప్రపంచవ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ అంతర్జాతీయ బాలికా దినోత్సవం అవగాహన కలిగిస్తుంది. ప్రపంచ అభివృద్ధికి సంబంధించిన అనేక ప్రణాళికలలో బాలికలను చేర్చడంగానీ, వారిని పరిగణించడంగానీ చేయడంలేదు, అలాగే వారి సమస్యలను కూడా పట్టించుకోవడంలేదు. వాషింగ్టన్ లోని యునైటెడ్ స్టేట్స్ అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ 2014లో అందించిన వివరాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 62 మిలియన్లకు పైగా బాలికలకు విద్య అందడంలేదు.

ప్రపంచవ్యాప్తంగా 5 నుండి 14 సంవత్సరాల వయస్సు గల బాలికలు, అదే వయస్సు గల అబ్బాయిల కంటే 160 మిలియన్ గంటలకుపైగా ఇంటి పనుల కోసం తమ సమయాన్ని కేటాయిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా, నలుగురిలో బాలికల్లో ఒకరికి 18 ఏళ్ళకంటే ముందుగానే వివాహం జరుగుతోంది. 2016, అక్టోబరు 11న, ఐక్యరాజ్య సమితి వుమెన్ గుడ్‌విల్ అంబాసిడర్ ఎమ్మా వాట్సన్, బలవంతపు బాల్య వివాహాలను అంతం చేయాలని ప్రపంచ దేశాలను, కుటుంబాలను కోరింది. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలియ జేయడమే కాకుండా, ఆ సమస్యలు పరిష్కరిం చబడినప్పుడు జరిగే పరిణామాల గురించి కూడా అవగాహన పెంచడానికి ఈ దినోత్సవం ఉపయోగపడుతోంది. బాలికలను విద్యావంతులను చేసి, బాల్య వివాహాలు తగ్గించడంలో, విద్యను అభ్యసించిన బాలికలు అధిక వేతనాలతో ఉద్యోగాలు పొందడంలో మార్గదర్శకంగా నిలవడం ద్వారా మహిళత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కూడా సహాయపడుతోంది. ప్రపంచవ్యాప్తంగా తన కార్యకలాపాలు నిర్వహించే ప్లాన్ ఇంటర్నేషనల్ అనే ఒక ప్రభుత్వేతర సంస్థ ప్రాజెక్టుగా ఈ అంతర్జాతీయ బాలికా దినోత్సవం ప్రారంభమైంది. ప్లాన్ ఇంటర్నేషనల్ రూపొందించిన బికాజ్ ఐ యామ్ ఎ గర్ల్ అనే క్యాంపెయిన్ నుండి అంతర్జాతీయ దినోత్సవ నిర్వహణ, వేడుకల ఆలోచన వచ్చింది. ఇది ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో బాలికలను సంరక్షించే ప్రాముఖ్యతపై అవగాహన పెంచుతుంది. కెనడాలోని ప్లాన్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు కెనడియన్ ఫెడరల్ ప్రభుత్వాన్ని సంప్రదించి మద్దతుదారుల కూటమిని కోరుతూ అంతర్జాతీయంగా అవగాహన పెంచుతూ, చివరికి ఐక్యరాజ్య సమితిని కూడా ఇందులో పాల్గొనాలని కోరింది. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో కెనడా తన తీర్మానంతో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని అధికారికంగా ప్రతిపాదించింది. కెనడా మహిళామంత్రి రోనా అంబ్రోస్ ఈ తీర్మానాన్ని స్పాన్సర్ చేసింది; 55వ ఐక్యరాజ్యసమితి కమిషన్‌లో మహిళల స్థితిగతులపై మద్దతుగా మహిళలు, బాలికల ప్రతినిధి బృందం ప్రదర్శనలు చేసింది. 2011, డిసెంబరు 19న జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో 2012, అక్టోబరు 11న తొలి అంతర్జాతీయ బాలికా దినోత్సవంగా ఆమోదించే తీర్మానానికి ఓట్లు వేయగా, అధికారికంగా బాలికా దినోత్సవం గుర్తించబడిందిని తీర్మానం పేర్కొంది.

ఈ బాలికా దినోత్సవం ప్రతి సంవత్సరం ఒక నేపథ్యాన్ని కలిగి ఉంటుంది.2012లో బాల్యవివాహాన్ని రూపుమాపడం, 2013లో బాలికల విద్య కోసం నూతననత్వం, 2014లో కౌమార బాలికలను సాధికారపరచడం, హింసను రూపుమాపడం. 2015లో కౌమార బాలికల శక్తి, విజన్ ఫర్ 2030, 2016లో బాలికల పురోగతి ,లక్ష్యాల పురోగతి, బాలికల గణనలు. 2017లో సాధికారిక బాలికలు, సంక్షోభాలకు ముందు, తరువాత,2018లో ఆమెతో ఒక నైపుణ్య బాలికల బృందం. 2013 నాటికి ప్రపంచవ్యాప్తంగా బాలికా దినోత్సవం సందర్భంగా సుమారు 2,043 కార్యక్రమాలు, వేడుకలు జరిగాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో ఈ బాలికా దినోత్సవాన్ని ప్రోత్సహించడానికి వివిధ కార్యక్రమాలు రూపొందించబడ్డాయి. భారతదేశంలోని ముంబైలో జరిగిన కచేరీ వంటి కార్యక్రమాలకు ఐక్యరాజ్యసమితి ఆర్థిక సహాయం అందిస్తుంది. గర్ల్ గైడ్స్ ఆస్ట్రేలియా వంటి ప్రభుత్వేతర సంస్థలు ఈ దినోత్సవం కోసం జరిగే కార్యక్రమాలు, కార్యకలాపాలకు సహకారం అందిస్తాయి. బాలికలు, ఫుట్‌బాల్ దక్షిణాఫ్రికా వంటి స్థానిక సంస్థలు తమ సొంత కార్యక్రమాలను రూపొందించుకున్నాయి, 2012లో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా టీ-షర్టులను పంపిణీ చేశాయి, 1956లో జరిగిన బ్లాక్ సాష్ మార్చ్‌ను 20,000 మంది మహిళలు గుర్తుచేసుకున్నారు. 2013లో లండన్ సౌత్ బ్యాంక్‌లో ఈ దినోత్సవం సందర్భంగా రోజంతా ఒక కార్యక్రమం జరిగింది, ఇందులో బాడీ గాసిప్ నిర్మించిన నాటక, సినిమా ప్రదర్శనలు జరిగాయి. ఇది శరీర అకృతి, మానసిక ఆరోగ్య సమస్యలపై ప్రచారం చేస్తుంది. వేలాది మంది కార్యకర్తలను, సంస్థలను ఆన్‌లైన్‌లోకి తీసుకురావడానికి సేజ్ గర్ల్, ఐట్విక్సీ సంస్థలు ఒక అంతర్జాల వేడుకను కూడా రూపొందించాయి. 2016లో లండన్ విమెన్ ఆఫ్ ది వరల్డ్ (వావ్) అనే సంస్థ ఒక వేడుకను నిర్వహించింది, ఇందులో 250మంది లండన్ పాఠశాల బాలికలు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 2016లో, యునైటెడ్ స్టేట్స్ మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా లింగ అసమానతను రూపుమాపడానికి ఒక ప్రకటన విడుదల చేశారు.

# చంద్రయాన్ ముగిసింది...గగన్ యాన్ మొదలైంది

**బెంగళూరు- ప్రభాత సూర్యుడు**



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో బృహత్తర ప్రయోగానికి సిద్ధమవుతోంది. చంద్రయాన్ 3, ఆదిత్య ఎల్ 1 ప్రయోగాల విజయవంతంతో ఇస్రో అంతరిక్ష ప్రయోగాలపై రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తోంది. ఇందులో భాగంగానే అంతరిక్షంలోకి వ్యోమగాముల్ని పంపేందుకు ప్రయత్నాలు చేస్తోంది. దీని కోసం గగన్‌యాన్ ప్రాజెక్టును చేపట్టింది. ఈ ప్రాజెక్టులో క్రూ మాడ్యుల్ అత్యంత కీలకమని ఇస్రో ప్రకటించింది. నింగిలోకి వ్యోమగాములు వెళ్లి రావడానికి క్రూ మాడ్యుల్ అత్యంత కీలకం. ఈ మేరకు క్రూ మాడ్యూల్ పరీక్షకు ఇస్రో సిద్ధమవుతోంది. త్వరలోనే క్రూ మాడ్యూల్‌ను ఇస్రో పరీక్షించబోతోంది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ- ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 మిషన్‌లోని విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ లు ఇక మేల్కొంటాయన్న ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఈ విషయాన్ని ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త, ఇస్రో మాజీ ఛైర్మన్ ఏఎస్ కిరణ్ కుమార్ తెలిపారు. ల్యాండర్, రోవర్ లు ఇంకా నిద్రాణస్థితి నుంచి బయటకు రావడం లేదని, సెప్టెంబర్ 22వ తేదీన చంద్రుడిపై సూర్యోదయం అయినప్పటికీ ల్యాండర్, రోవర్లు ఇంకా మేల్కొవడం లేదన్నారు. ఇస్రో వాటిని మేల్కొలిపేందుకు ప్రయత్నిస్తున్నా.. ఫలితం లేదన్నారు. భారత్ ప్రతిష్టాత్మకంగా పంపిన చంద్రయాన్-3 ప్రాజెక్టు ఇక ముగిసినట్లేనని ఆయన అభిప్రాయపడ్డారు. గగన్‌యాన్ మిషన్‌కు చెందిన టెస్ట్ వెహికల్ అబోర్ట్ మిషన్-1(టీవీ-డీ1) రూపుదిద్దుకుంది. టీవీ-డీ1 మాడ్యూల్‌ను లాంచింగ్ కాంప్లెక్స్‌కు చేర్చారు. టీవీ-డీ1మాడ్యూల్ నిర్మాణం తుది దశలో ఉన్నట్లు ఇస్రో తెలిపింది. ఈ మాడ్యూల్ 17 కిలోమీటర్ల ఎత్తుకు వెళ్లిన తర్వాత.. అబార్ట్ సీక్వెన్స్‌లో భాగంగా మళ్లీ భూమి మీదకు వస్తుంది. పారాచూట్ల సాయంతో అది దిగుతుంది. శ్రీహరికోట నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న సముద్ర ప్రాంతంలో ఆ మాడ్యూల్ ల్యాండ్ అవుతుంది. ఆ మాడ్యూల్‌కు చెందిన ఫొటోలను ఇస్రో తన సోషల్ మీడియా అకౌంట్‌లో పోస్టు చేసింది. క్రూ మాడ్యూల్ పీడనం ఉండదు. వాటిలోనే వ్యోమగాములు నింగిలోకి వెళ్తారు. అయితే ప్రస్తుతం టెస్టింగ్ కోసం ఆ మాడ్యూల్‌ను నింగిలోకి పంపి, మళ్లీ భూమిపై దించనున్నారు. ఈ పరీక్ష సమయంలో క్రూ మాడ్యూల్ బంగాళాఖాతంలో ల్యాండ్ అవుతుంది. సముద్రం నుంచి ఇండియన్ నేవీ ఆ మాడ్యూల్ మెషన్‌ను తీసుకురానున్నట్లు ఇస్రో ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం క్రూ మాడ్యూల్‌ను బెంగుళూరులోని ఇస్రో సెంటర్‌లో టెస్టింగ్ చేశారు. టెస్ట్ ఫ్లయిట్ సక్సెస్ అయిన తర్వాత గగన్‌యాన్ మిషన్ చేపట్టనున్నారు. ఒక వేళ మేల్కోవాల్సి ఉంటే ఇప్పటికే అది జరిగి ఉండేదన్నారు. ఇక విక్రమ్, ప్రజ్ఞాన్ నిద్రాణ స్థితి నుంచి బయటకు వచ్చే అవకాశం లేదని అన్నారు. చంద్రయాన్-3 నుంచి అనుకున్న ఫలితం ఇప్పటికే వచ్చిందని, ఏ దేశానికి సాధ్యం కాని రీతిలో దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 కాలు మోపిందని స్పేస్ కమిషన్ మెంబర్ అయిన ఏఎస్ కిరణ్ కుమార్ తెలిపారు. చంద్రుడి దక్షిణ ధ్రువం నుంచి ఎంతో విలువైన సమాచారం ఇస్రోకు అందిందన్నారు. ఆ సమాచారం కచ్చితంగా ఉపయోగ పడుతుందని చెప్పారు. తదుపరి చేపట్టే ప్రాజెక్టుల్లో విజ్ఞానపరంగా, ప్లానింగ్ పరంగా ఆ ప్రాంతానికి సంబంధించి ఈ సమాచారం ఎంతో ఉపయోగ పడుతుందని కిరణ్ కుమార్ తెలిపారు.

# అమల్లోకి ఎన్నికల నిబంధనలు
## వేలపైన క్యాష్ క్యారీ వద్దు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

దేశంలో ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు నగరా మోగింది. తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరం రాష్ట్రాల అసెంబ్లీలకు కేంద్రం ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ రాజీవ్ కుమార్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. దీంతో ఆయా రాష్ట్రాల్లో తక్షణమే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం నిఘా ఆయా రాష్ట్రాల్లో మొదలయ్యింది. నగదు, బంగారం ఇతర వస్తువుల తరలింపుపైనా ఆంక్షలు అమల్లో ఉంటాయి. ఓటర్లను ప్రభావితం చేసేలా తాయిలాలు, నగదు పంపిణీతో పాటు ఇతర ప్రలోభాలపై నిఘా ఉంటుంది. ఈ నేపథ్యంలో పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లేవారు జాగ్రత్తగా ఉండాల్సిందే. నిబంధనల ప్రకారం, రూ.50 వేల వరకే నగదు తీసుకెళ్లేందుకు అనుమతి ఉంటుంది. అంతకు మించి డబ్బు, బంగారం, ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే సామగ్రి ఉంటే వాటిని పోలీసులు సీజ్ చేస్తారు. పోలీసులు, అధికారుల తనిఖీల్లో సరైన పత్రాలు చూపించకుంటే.. వాటిని సీజ్ చేసే అవకాశం ఉంది. ఎన్నికలు ముగిసిన తర్వాత ఆధారాలు చూపిస్తేనే వాటిని తిరిగి ఇచ్చే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, శుభకార్యాలు, ఇతర అవసరాలకు అధిక మొత్తంగా నగదు తీసుకెళ్లేవారు పలు జాగ్రత్తలు తీసుకోసుకోవడం తప్పనిసరి. తెలంగాణలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల అధికారులు, పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తుంటారు.

# నాగటి నారాయణ సేవలు చిరస్మరణీయం

**టీఎస్ యుటిఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి కంచి రవికుమార్**



**రామన్నపేట - ప్రభాత సూర్యుడు:** అగ్రశ్రేణి నాయకుడు, తొలితరం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రధాన ఉద్యమకర్త నాగటి నారాయణ సేవలు ఉపాధ్యాయ లోకం మరువలేనిదని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయు ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి కంచి రవికుమార్ అన్నారు. మంగళవారం నాగటి నారాయణ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని టీఎస్ యుటిఎఫ్ రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో నాగటి నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ.. పరిపూర్ణమైన నాయకత్వ లక్షణాలు కలిగిన గొప్ప వ్యక్తి అని, రాబోవు తరాలు ఆయన మార్గంలో నడవాలని, ఆశయాలను సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సిలివేరు అనిల్ కుమార్, ఉపాధ్యాయులు జానయ్య, విజయ్ రెడ్డి, ఎం ఆర్ సి సిబ్బంది భిక్షం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఒక్కసారి అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తాం

**- అన్ని వర్గాల సంక్షేమం కోసం ఆరు కాంగ్రెస్ గ్యారంటీ పథకాలు..**

**- పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటి పర్తి జీవన్ రెడ్డి**



**జగిత్యాల- ప్రభాత సూర్యుడు:** జగిత్యాల పట్టణంలోని 2 వ వార్డు లో పట్ట భద్రుల ఎమ్మెల్సీ తాటి పర్తి జీవన్ రెడ్డి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కాంగ్రెస్ అరు గ్యారంటీ ల పై ప్రచారం నిర్వహించారు.. ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ కు ఓటు వేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ జెండాలు పట్టుకొని, కార్యకర్తలు, నాయకులు ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకునేందుకు కాంగ్రెస్ కు ఓటు వేయండి.. ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తాం. మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు ప్రతి నెలా రు.2500, ఇవ్వడం తోపాటు సిలిండర్ రు.500 లకే ఇస్తాం.. మహిళలకు ఆర్ టీ సీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పి స్తాం. రైతు భరోసా పథకంలో భాగంగా రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీతో పాటు ప్రతి ఏటా రైతులు కౌలు రైతులకు రైతుబంధు పథకం కింద రు.15,000 అందిస్తాం. వ్యవసాయ కూలీలకు రు.12,000 అందిస్తాం. వరి ధాన్యం మద్దతు ధరపై అదనంగా క్వింటాల్కు రు.500 బోనస్ కల్పిస్తాం. చేయూత పథకం కింద పెన్షన్ 4000 అందిస్తాం రాజీవ్ ఆరోగ్య శ్రీ బీమా కింద పది లక్షల ఉచిత వైద్య సౌకర్యం. గృహ జ్యోతి పథకంలో భాగంగా ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం. ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు అందిస్తాం తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం ఇస్తాం. యువ వికాసంలో భాగంగా విద్యార్థులకు ఉన్నత చదువుకునేందుకు 5 లక్షల ఆర్థిక సహాయం కల్పిస్తాం.సంక్షేమ పథకాలు పొందాలంటే రేషన్ కార్డ్ ఆధారం. కేంద్రం పై రాష్ట్రం.. రాష్ట్రం పై కేంద్రం నెపం నెట్టి సామాన్యుల పై సిలిండర్ ధర పెంచిన భారం వేశారు. కాంగ్రెస్ పాలనలో తొమ్మిది రకాల నిత్యావసర వస్తువులు ఇచ్చినం. తెలంగాణ వచ్చిన తర్వాత కేవలం బియ్యానికి పరిమితం అయింది . ఉమ్మడి రాష్ట్రంలోని రాయితీలు కొనసాగిస్తూ కొత్తగా పథకాలు అమలు చేయాలి..తెలంగాణ వచ్చిన తర్వాత ఉద్యోగాలు వస్తాయని భావిస్తే కనీసం ఖాళీలు కూడా భర్తి చేయడం లేదు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగాలు అంగట్లో సరుకులు అయ్యాయని అయన అన్నారు. ఒక్కసారి కూడా గ్రూప్ 1 ఉద్యోగాలు భర్తీ చేయలేదు. ఒక్కసారి కూడా డీ ఎస్సీ నిర్వహించలేదు. నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదు. ఉద్యమ ఆకాంక్షలు నిర్వీర్యం చేసిన సీఎం కెసిఆర్ కు ఓటు అడిగే నైతిక హక్కు లేదు. కాంగ్రెస్ కు ఒకసారి అవకాశం కల్పించాలి. కళ్యాణ లక్ష్మి తో పాటు అదనంగా వధువు కు తులం బంగారం పెడతాం. అని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు.

## వివాహిత హత్యకేసులో నిందితుడు అరెస్టు

**అవనిగడ్డ- ప్రభాత సూర్యుడు:** అవనిగడ్డ నాగాయలంకలో దారుణ హత్యకు గురైన దుర్గ కేసులో హంతకుడిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నాగాయలంక పోలీస్ స్టేషనులో అవనిగడ్డ సీఐ ఎల్. రమేష్ మీడియాతో మాట్లాడుతూయతిరాజుల ప్రకాష్ భార్య దుర్గను అవనిగడ్డ మండలం అశ్వారావుపాలెం గ్రామానికి చెందిన రేపల్లె హేమంత్ కనక వరప్రసాద్ అనే యువకుడు కొంతకాలంగా కోరిక తీర్చమని వేధిస్తున్నాడు. దుర్గ, ఆమె భర్త ప్రకాష్ ఇటీవల అతనిని వారించగా కోపం పెంచుకున్న హేమంత్ దుర్గను ఆమె పని చేసే హోటల్ వద్దకు వచ్చి కత్తితో పొడిచి హత్య చేసినట్లు సీఐ తెలిపారు. ప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి హేమంత్ ను పులిగడ్డ వద్ద అరెస్టు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

## టీఎస్ యుటిఎఫ్ రంగారెడ్డి జిల్లా కోశాధికారి జగన్నాథ్





**యాచారం-ప్రభాత సూర్యుడు:** యుటీఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు నాగటి నారాయణ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని యాచారం ఎమ్మార్సీ కార్యాలయంలో జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీఎస్ యుటిఎఫ్ రంగారెడ్డి జిల్లా కోశాధికారి జగన్నాథ్ హాజరైనారు. వారు మాట్లాడుతూ నాగటి నారాయణ 4 డిసెంబర్ 1956 ఖమ్మం జిల్లా బోనకల్ మండలం పెద్దబీరపలిలో నిరుపేద దళిత వ్యవసాయ కార్మిక కుటుంబంలో జన్మించారు. సామేలు సుందరమ్మలకు నారాయణ ఒక్కడే కుమారుడు చెల్లెలు మేరీ ఉన్నారు బాల్యంలో అనేక కష్టాలను అధిగమించి చదువు కున్నారు ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ లో పనిచేశారు భార్య అమృత సహకారంతో బిఏ టిటిసి చదివారు.1980 అక్టోబర్ 30న గిరిజన సంక్షేమ శాఖ ఎస్ జి టి ఉపాధ్యాయులుగా చేరారు విద్యార్థి ఉద్యమం ఇచ్చిన చైతన్యంలో గిరిజన సంక్షేమ శాఖలోని అధికారుల నిరంకుశ తత్వాన్ని ప్రశ్నించారు. ఎదిరించారు. నారాయణ నిరంతర ఉద్యమకారుడు నిరంతర అధ్యయనశీలి సాహిత్య అభిమాని మంచి వక్త సాంస్కృతిక రంగంలో ప్రావీణ్యం ఉన్నవారు.క్రమ శిక్షణ, అంకితభావం ,పట్టుదల గల నాయకులు టీచర్ల సమస్యల పట్ల వారి నిబద్దత వారు యుటీఫ్ ఉద్యమానికి చేసిన సేవలు అపూర్వమైనవని ,వారి జీవితం భావితరాలకు ఆదర్శవంతమైనదని కొనియాడారు . మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్. నర్సింహ , పి.ఆంజనేయులు ,జిల్లా విహో టి టి కన్వీనర్ వెంకటేష్ ,మండల కమిటీ సభ్యులు మోహన్ , జంగయ్య,వెంకట చారీ ,మహేష్ , జగదీష్, మధార్ ,భాస్కర్, కృష్ణవేణి సరిత, స్వరూప, ఉమేరా బేగం, జడ్.పి.హెచ్.ఎస్ యాచారం ప్రధానోపాధ్యాయులు నరసింహ, జడ్పిహెచ్ఎస్ మాల్ ప్రధానోపాధ్యాయులు శంకర్ నాయక్ పాల్గొన్నారు.

## ఫార్మా సిటీ భూనిర్వాసితులతో ఈటల భేటీ

**రంగారెడ్డి- ప్రభాత సూర్యుడు:** రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం ముచ్చర్ల గ్రామంలో ఫార్మా సిటీలో భూములు కోల్పోయిన భూనిర్వాసితులు, బాధితులతో హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ నాయకులు ఈటల రాజేందర్,పార్టీ నేత తల్లోజు ఆచారి మంగళవారం సమావేశమయ్యారు. బీజేపీ అధికారంలోకి రాగానే లాక్కొన్న భూములు తిరిగి ఇస్తామని హామీ ఇచ్చారు ఈటల రాజేందర్. కందుకూరు మండలంలో అన్నివనరులున్నా... అధికార యంత్రాంగం ఆదరణ లేక వెనకబ డిందన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్చార్జి అందెల శ్రీరాములు మాట్లాడుతూ మా భూములు లాక్కొన్ని కోట్ల రూపాయలకు అమ్మేఅధికారం ఎవడిచ్చాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా స్థలాల్లో కట్టిన డబుల్ బెడ్ రూమ్స్ మాకే కాకుండా పాతబస్తీవాసులకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్, కన్వీనర్ దేవేందర్ రెడ్డి, , కందుకూరు మండలం ఎంపీపీ మందా జ్యోతి పాండు, అధ్యక్షులు అశోక్ గౌడ్ సహా పలువురు ప్రజాప్రతినిధులు,ఇతర పార్టీల నాయకులు బీజేపీలో చేరారు.

## టాప్ గేర్‌లోకి గులాబీ

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

తెలంగాణలో వరుసగా రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ వచ్చే అసెంబ్లీ ఎన్నికలకోసం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. కొట్లాడి తెలంగాణ తెచ్చిన పార్టీగా.. సొంత ఇమేజ్‌ని కాపాడుకుంటూ హ్యాట్రిక్ విక్టరీ కొట్టాలన్న టార్గెట్‌తో గులాబీపార్టీ దూసుకెళ్తోంది. ప్రతిపక్షాలకంటే చాలాముందే ఏకకాలంలో అభ్యర్థులను ప్రకటించి సవాల్ విసిరింది బీఆర్ఎస్. సిట్టింగ్‌లలో కొందరిపై వ్యతిరేకత ఉన్నా.. ముఖ్యమంత్రి కేసీఆర్ చరిష్మాకు తోడు ప్రభుత్వ పథకాలతో ప్రజల మళ్లీ తమకే పట్టం కడతారన్న నమ్మకంతో ఆ పార్టీ ఉంది. విపక్షాలు బలం పుంజుకున్నచోట తనదైన వ్యూహంతో బీఆర్ఎస్ ముందుకెళ్తోంది. నిజామాబాద్ జిల్లా కామారెడ్డినుంచి పోటీకి కేసీఆర్ నిర్ణయించుకోవడం ఆ వ్యూహంలో భాగమే. 2019ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీగా పోటీచేసి ఓడిపోయారు కవిత. కేసీఆర్ కామారెడ్డిని ఎంచుకోవడానికి ఇది కూడా ఓ కారణం. తాను పోటీచేస్తే ఆ ప్రభావం కేవలం జిల్లావ్యాప్తంగా ఉంటుందని, చుట్టుపక్కల జిల్లాలపైనా దాని ఎఫెక్ట్ ఉంటుందన్నది బీఆర్ఎస్ అధినేత అంచనా. అందుకే మొదట్నించీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు తమకు కంచుకోటలా ఉన్న ఉత్తర తెలంగాణపై ఫోకస్ పెంచారు.అధినేతకు తోడుగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీష్‌రావు పర్యటనలతో పార్టీ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఇక అధినేత కూడా రంగంలోకి దిగుతున్నారు. సంక్షేమపథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తోంది బీఆర్ఎస్. తాము అధికారంలోకి రాకముందు వచ్చిన తర్వాత వచ్చిన మార్పుని ప్రజలు గమనించారంటోంది. అధికారంలోకి రావాలని తాపత్రయపడుతున్న కాంగ్రెస్, బీజేపీ ప్రజలకు ఏం చేశాయని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. బీజేపీ అగ్రనేతలు రంగంలోకి దిగడం, కాంగ్రెస్ హామీలతో బీఆర్ఎస్ కూడా మరిన్ని ప్రజాకర్షక హామీలు, పథకాలకు సిద్ధమవుతోంది. తన మేనిఫెస్టోతో విపక్షాల ఎత్తులను చిత్తు చేయాలనుకుంటోంది. రెండుసార్లు అధికారంలో ఉండటంతో సహజంగా ఉండే ప్రజావ్యతిరేకతతో నష్టం జరగకుండా చూసుకునే వ్యూహంతో ఆ పార్టీ ఉంది. ఎంఐఎం మద్దతుతో మైనారిటీ ఓటుబ్యాంక్ చేజారకుండా జాగ్రత్తపడే ప్రయత్నాల్లో ఉంది. కాంగ్రెస్, బీజేపీ రెంటినీ టార్గెట్ చేసుకుంటూ ప్రచారంలో స్పీడ్ పెంచారు బీఆర్ఎస్ అగ్రనేతలు.ఎన్నికల షెడ్యూల్ విడుదలవ్వడంతో.. సీఎం కేసీఆరే ఇక రంగంలోకి దిగనున్నారు. వరుస బహిరంగ సభలు.. ఎమ్మెల్యే అభ్యర్థులతో భేటీ.. వ్యూహాలకు ప్రతివ్యూహాలను రచిస్తూ.. విపక్ష పార్టీలకు సవాల్ విసరనున్నారు. ఇప్పటికే.. సీఎం కేసీఆర్ పర్యటనలకు సంబంధించిన షెడ్యూల్ సైతం విడుదలయ్యింది. దీంతో బీఆర్ఎస్ నేతలు ఆ సభలను విజయవంతం చేసేందుకు రెట్టింపు ఉత్సాహంతో ముందుకెళ్తున్నారు.

**సర్వేల్లో కాంగ్రెస్ ఎడ్జ్**

తెలంగాణ ఇచ్చిన పార్టీగా ఇప్పటి వరకూ ఫలితాల్ని పొందలేకపోయిన కాంగ్రెస్ పార్టీకి ఈ సారి ఒపీనియన్ పోల్స్ లో మంచి సంకేతాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ.. బీఆర్ఎస్ కన్నా ముందు ఉందని చెబుతున్నాయి. క్లియర్ కట్ మెజార్టీ సాధించకపోయినా కాంగ్రెస్ పార్టీకే అడ్వేంటేజ్ ఉంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య కనీసం ఐదు సీట్ల గ్యాప్ ఉంటుందని ఒపీనియన్ పోల్ చెబుతోంది. అయితే ఓట్లు పోలరైజ్ అయితే.. ఎన్నికలు దగ్గర పడేకొద్దీ గ్యాప్ పెరిగే అవకాశం ఉంటుంది. అయితే బీఆర్ఎస్ పార్టీ ఇంత దూకుడుగా ఉన్నా వెనుకబడిందన్న విశ్లేషణలు వస్తున్నాయి. తెలంగాణ ఏర్పాటు నుంచి ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. పదేళ్లుగా ఉన్న పాలన వల్ల ప్రజల్లో అధికార వ్యతిరేకత అనేది సహజంగానే పెరుగుతుందని భావిస్తున్నారు. ఈ అధికార వ్యతిరేకత తగ్గించడానికి బీఆర్ఎస్ ఇటీవలి కాలంలో పెద్ద ఎత్తున పథకాలు అమలు చేస్తోంది. దళిత బంధు, బీసీ బంధు సహా అనేక పథకాలు ప్రవేశ పెట్టారు. త్వరలో మైండ్ బ్లాంక్ అయ్యే పథకాలతో మేనిఫెస్టో ప్రకటిస్తామని చెబుతున్నారు. అయితే అధికారంలో ఉన్న పార్టీ.. ఇలాంటి పథకాలు ప్రకటిస్తే... ఇప్పటి వరకూ ఎందుకు అమలు చేయలేదన్న ప్రశ్న వస్తుంది.

## ఇబ్రహీంపట్నం గడ్డపై నీలి జెండా ఎగరేస్తాం

**నూతన మండల కమిటీ ఎన్నిక**

**మండల అధ్యక్షునిగా చిత్రం కృష్ణ**



**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు:** రాబోయే ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బీఎస్పీ జెండా ఎగరేస్తామని రాష్ట్ర ఇసి మెంబర్ గ్యార జగన్, జిల్లా ఇన్చార్జ్ పల్లాటి రాములు, అసెంబ్లీ అధ్యక్షులు గ్యార మల్లేష్, యంజాల ప్రహ్లాద్ లు ధీమా వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అబ్దుల్లాపూర్ మెట్ మండలం, పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ, తుర్కయంజాల్ మున్సిపాలిటీల బహుజన్ సమాజ్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రములో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం గడ్డపై నీలి జెండాను ఎగరవేసే విధంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన అబ్దుల్లాపూర్ మెట్ మండల కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్ష, కార్యదర్శులు చిత్రం కృష్ణ, బంగారి మైసయ్యలు మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బహుజన్ సమాజ్ పార్టీ గెలుపుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు. మండల కమిటీ ఏర్పాటుకు సహకరించిన రాష్ట్ర, నియోజకవర్గ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ అధ్యక్షులు నల్ల పరమేష్, కార్యదర్శి గట్టు నర్సింహా, తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షులు వద్దిగళ్ళ బాబు, ఉపాధ్యక్షులు, మేతరి కుమార్, కార్యదర్శి బూతం రమణ, జంతుక సైదులు, కోశాధికారి పట్నం రమేష్ కురుమ రాజు, మురళీ, బంగారి బాలకృష్ణ, కడారి సుధాకర్, యేసు, శ్రీహరీ, బంటి, శివ, శివ ప్రసాద్, యేమ్మే శివ శంకర్, కందికంటి నవీన్, దొడ్ల ప్రేమ్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.




## పేదలకు ఇండ్లు ఇచ్చిన తర్వాతనే ఓట్లు అడగాలి

**మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం-ప్రభాత సూర్యుడు:** ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని సాయి ఫంక్షన్ లో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మర్రి నిరంజన్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బి ఆర్ఎస్,బీజేపీ లపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. 135 సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ సమన్వయంతో క్రమ పద్ధతితో ఉంటుంది నియోజకవర్గంలో అధిష్టానం నిర్ణయం తీసుకుంటుంది. ఎమ్మెల్యే టికెట్టు ఎవరికి వచ్చిన మేమందరం కలిసికట్టుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా ప్రజా వ్యతిరేక విధానాన్ని ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని తెలియజేశారు. నిత్యం ప్రజలలో ఉండే నాయకుని కోరుకుంటున్నాం. బిఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకలు అమలు చేయడం లేదు. స్థానిక ఎమ్మెల్యే పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. పేదలకు ఇల్లు ఇవ్వడంలో విఫలం అయ్యారు,పేదలకు ఇండ్లు ఇచ్చాకే ఓట్లు అడగాలని అన్నారు. బీసీ లోన్ కూడా పూర్తిగా విఫలం అయ్యారు. నియోజకవర్గం ఎన్ని దళిత బందు వచ్చాయి అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ నాయకులకే ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇచ్చారు. కేంద్రం ఇచ్చే మధ్యాహ్నం పథకం కూడా సరిగా పెట్టడం లేదు, ఇంకా టిఫిన్ పథకం ఎవరికోసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉన్న పథకాలు అమలు చేస్తే చాలు ప్రజలు బాగుపడతారు. సాధారన్ క్యాంపు ఎత్తి వేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 6సంక్షేమ పథకాలు మహాలక్ష్మి , ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, యువ వికాసం, గృహ జ్యోతి, చేయూత ఈ పథకాలు అమలు చేస్తామని తెలియజేశారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215